"ఏమయ్యా ! ప్రింటు పడని శుభలేఖ పంపిస్తే ఎలా తెలుస్తుందనుకున్నావు? నేనుగా వచ్చాను కాబట్టి సరిపోయింది'' అని. అతను తెల్లబోయాడు!'' నేనసలు శుభలేఖలే అచ్చు వేయించలేదే! ఎవరిదో అది!'' అంటూ పక్కకు వెళ్ళిపోయాడు

నేను నిశ్చేష్టుడినయ్యాను.అంటే జీతంలో డబ్బు ఆరొందలు ఈ పూటకీ పూట హరించుకుపోగా, ఈ శుభలేఖ తాలూకు అసలు చదివింపు శ్రమా వగైరాలు నేనింకా ఫేస్ చెయ్యవలసి ఉందన్న మాట.హటాత్తుగా నా నవనాడులూ కుంగిపోయాయి. ఎంత వేగంగా విజయశిఖరం ఎక్కానో అంత వేగంగానూ అఖాతంలోకి పడిపోయాను నామనస్సు క్షోభతో నిండిపోయింది.

బయటికి వచ్చాను.

వూళ్లో ఒక పది రోజుల పాటు ఎవరికీ కనిపించకుండా ఉండేందుకు తక్షణం బండెక్కటం మంచిదనిపించింది. టూర్ ప్రోగ్రాంను మర్నాటికే రీఫిక్స్ చెయ్యమని రిక్వెస్ట్ చెయ్యటం కోసం ఎక్కడో వూరికి అవతల మూల సనత్‌నగర్‌లో ఉన్న మా ఆఫీసర్ ఇంటివైపు నా బండిని పరుగెత్తించాను.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక., 20-9-79.)

★★★ ★★★ ★★★

# వొద్దన్నానా?

"అమ్మా, పులుసులో పోపు మాడినట్టుగా ఉందే!'' "మాడటమా! నేను పెట్టిన పోపు ఎంతనిరా! రెండు శనగ బద్దలే గదా వేశాను!''

"అయితే ఆ బద్దలే మాడాయి.''... "చూడ్రా,అసలు వాటి రంగే మారందే!''.. "అదీ కథ - పచ్చి గింజల వాసనన్నమాట!''

"ఏడిశావ్ ! మరి ఈ మినపగింజలు ఎట్లా ఎర్రబడ్డాయంటావు?'' "సరే! బెల్లం వేశావు అవునా?''... "గోలీకాయంతే గదరా నేవేసింది!''

"చింతపండు కొత్తదా, పాతదా?''.. "కొత్తది అప్పుడే ఎక్కడొచ్చింది? పాతదే!''.. "అదుగో అదీ గోల! పురుగుల పండు వేసుంటావు- రుచి మారిపోయి చచ్చింది!''... "రెండోరకం సరుకు మనింట్లో వాడగా నువ్వెప్పుడైనా చూశావా అసలు?''

"మంచినీళ్లలో డి డి.టి. కలిసిందా?'' "ఇవ్వాళసలు పంపులు రానే రాందే! బావినీళ్ళు వాడాను వంటకి''.

"పెదవేగి కరివేపాగ్గాని వేశావా?'' "నువ్వా. మీ బావా వాళ్ళ దొడ్లో క్రికెట్టాడారుగా, నాయనా.

దిబ్బకి కరేపచెట్టు చచ్చూరుకుందని మరునాడే మామయ్యొచ్చి చెప్పాడు"

" పోనీ కొత్తిమెర... కొత్తిమెర వేసుంటావ్!... చెప్పెయ్!"... " ఇదిగో పులుసంతా కలుపుతున్నాను కొత్తిమెర రెమ్మ కనిపిస్తే ఛీ! అను పడతాను"

" మరేంటే గోల! ఏదో వాసన ! ఛీ!ఛీ! ఇది పులుసా. ఫాస్ఫరిక్ ఆసిడా?"

" ఏంలేదురా, నాన్నా,రెండుపుదీనా ఆకులు తరిగివేశానంతే సువాసన కోసం" . " ఏంటీ, పుదీనా ఆకా ! అదన్న మాట ఆ చెత్తవాసన!. పులుసక్కర్లేదు. మజ్జిగ పోసెయ్"... " ఒక్క గరిటె పోసుకుని చూడ్రా! ఎంతో రుచిగా ఉందని మీ నాన్నగారు మరీ మరీ పోయించుకుని తాగారు పోనీ అరచేతిలో పోయించుకుని రుచి చూడు బాబూ!". " ఒద్దని చెపితే నీ క్కాదూ! మజ్జిగ పోస్తావా,లేచి పొమ్మంటావా ?"

" ఇస్స్! బావకి రుచి చూపిద్దామని తెచ్చానూ, మా దొడ్లోని ఈ రెండాకులూ తీసుకో అత్తయ్యా- అని చెప్పి ఇచ్చిపోతే వేశాను కానీ, లేకపోతే నాకు మాత్రం ఆ ఆకుల మీద మోజాపాడా! ఎప్పుడన్నా వాడాను కనకనా!"

"ఎవరు?" . " ఎవరా - నీ మరదలు! పెదవేగి మామయ్య కూతురు. స్కూలుకెడుతూ రిక్షా దిగి ఇచ్చి పోయింది"

" మరామాట ముందే చెప్పలేదే!" .. " ఇప్పుడు చెప్పాగా!"

" వూఁ నువ్వన్నీ ఇట్టాంటి పన్లే చేస్తూంటావ్! అరిచేతిలో అరగరిటెడు పొయ్యి. వూఁ ఏదో ఉందిలే.. అట్లా కొసిరి కొసిరి పోస్తావేంటి ? కొంచెం అన్న పెట్టి పోస్తే మాత్రం వొద్దన్నానా ! వూఁ, పొయ్యి!"

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక., 30-11-83.)

★★★ ★★★ ★★★

# సుందరి విరహం

అర్ధరాత్రొచ్చి తలుపుతట్టాడు యోగారావు భార్య సుందరొచ్చి తలుపు తీసింది అంది: "అఁ మీరా, వచ్చేసారా మీకు వేయ్యేళ్ళాయుష్షండీ!. పొద్దున్నే కాకి అరిస్తేనూ మీరే మనస్సులోకొచ్చారు సుమండీ!... ఇంతఅర్ధరాత్రి రాకపోతే పొద్దున్నే రాకపోయారా. అసలే రైళ్ళల్లో దొంగల భయాలు అవ్వీనూ . పోనీండి.. ఆ సూట్ కేసిల్లా ఇవ్వండి . మీ ట్రెయినింగు కాంపు బాగా జరిగిందా? మళ్ళీ వెళ్ళక్కర్లేదుగద!'

" అఁ బాగానే జరిగింది" అన్నాడు యోగారావు కుర్చీలో కూర్చుని బూట్లువిప్పుతూ